ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ - సిర్పూర్(టి)

కొన్ని రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వార్ధా, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌటాల సీఐ సాదిక్‌పాషా తెలిపారు. మహారాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు సూచనల మేరకు పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచన మేరకు ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితిలో రైతులు, జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని, నాటు పడవలో ప్రయాణం చేయకూడదని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్ఐ దీకొండ రమేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అనుదినం జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

1

శనివారం 29 జులై 2023

పోలింగ్ కేంద్రాల సవరణపై అభ్యంతరాల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఓటర్ల సౌకర్యార్థం దూర ప్రాంతాల్లో ఉన్న ఓటింగ్ కేంద్రాలను గుర్తించి పోలింగ్ కేంద్రాలను సవరించి జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, ఏవైన అభ్యంతరాలుంటే ఆగస్టు 4లోగా తెలియజేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 584 పోలింగ్ కేంద్రాల్లో 1300 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలతో పాటు ఓటర్లకు రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను సవరించినట్టు పేర్కొన్నారు. ఈ సవరణ కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల విభజన జాబితా ఫార్మేట్ 1, 2, 3, 4లో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. అభ్యంతరాలను ఆగస్టు 4లోగా తెలపాలని పేర్కొన్నారు.

ఆస్తి కోసం వృద్ధురాలి హత్య

నవతెలంగాణ - బెజ్జూర్

మండల కేంద్రంలో ఆస్తి కోసం వృద్ధురాలిని హత్య చేసిన సంఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు శుక్రవారం కన్నెపెల్లి మండలం రెబ్బెన గ్రామానికి చెందిన గట్టు వెంకటేశ్వర్‌గౌడ్ బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన చిన్నమ్మ అయిన గట్టు చంద్రకళపై కత్తితో దాడిచేసి హత్య చేశాడు. మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇంటిలోకి వచ్చిన వెంకటేశ్వర్‌గౌడ్, గట్టు కేశాగౌడ్ చంద్రకళతో ఆస్తి విషయమై మాట్లాడారు. కేశాగౌడ్ చంద్రకళకు పిల్లలు లేకపోవడంతో తనకే ఆస్తి ఇవ్వాలంటూ వెంకటేశ్వర్‌గౌడ్ వారిని కోరడంతో దానికి వారు సమ్మతించకపోవడంతో ఆగ్రహించిన వెంకటేశ్వర్‌గౌడ్ తన వెంట తెచ్చుకున్నకత్తితో చంద్రకళ గొంతు కోశాడు. అక్కడే ఉన్న కేశాగౌడ్ కేకలు వేయడంతో అతనిపై కూడా కత్తితో దాడి చేశాడు. చంద్రకళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు చంద్రకళ భర్త కేశాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ

నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని జక్కులపెల్లి గ్రామంలో రూ.5 లక్షల జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పేర పోశయ్య, కిష్టాపూర్ ఎంపీటీసీ దుర్గం రాము, కోఆప్షన్ సభ్యుడు జహీరొద్దీన్, ఉప సర్పంచ్ కుండేటి స్వప్న, వార్డుసభ్యులు సతీష్, రేణుక, సెక్రటరీ సౌందర్య, బీఆర్ఎస్ నాయకులు పల్లె రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-ముథోల్

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో పంట పొలాల మునక వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని, గ్రామాల్లో చాలా వరకు ఇండ్లు కూలిపోయి ప్రజలు ఇబ్బంది పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. గత సంవత్సరం పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించలేని కేసీఆర్ ప్రభుత్వం, ఇప్పుడు ప్రాథమిక అంచనాల పేరుతో స్థానిక అధికారులు, ఎమ్మెల్యే హడావుడి చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ముంపు పంట పొలాల పరిశీలన

నవతెలంగాణ-కోటపల్లి

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో నష్టపోయిన రాంపూర్ రైతుల పొలాలను శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దాసరపు శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినప్పటికీ రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో పంటలు మునుగుతూనే ఉన్నాయన్నారు. చెన్నూర్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని కట్టిన కాళేశ్వరంతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ హైదరాబాద్ విడిచి రావటం లేదన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుర్గం వెంకటస్వామి ఉన్నారు.

ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని టిపిసిసి సభ్యుడు గణేష్ రాథోడ్ ఆరోపించారు. మండలంలోని తుంపల్లి వాగు వద్ద ఇద్దరు వ్యక్తులు గల్లంతు కాగా సహాయక చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగు ప్రవాహంలో ఇద్దరు వ్యక్తులు ఉదయం 10గంటలకు గల్లంతు అయినప్పటికీ సాయంత్రం నాలుగు గంటల వరకు కూడా రెస్క్యూ టీం రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సరైన సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉంటే గల్లంతయిన వారు దొరికే వారన్నారు. అధికారులు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే సంఘటనకు కారణమన్నారు. వరద ప్రవాహ ప్రాంతాల్లో కనీస రక్షణ చర్యలు చేపట్టలేదనడానికి ఈ సంఘటన నిదర్శనమని తెలిపారు. ఆయన వెంట నాయకులు పరశురాం ఉన్నారు.

వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది

నవతెలంగాణ-జన్నారం

కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నది పరివాహక ప్రాంత గ్రామాలలో ముంపుకు గురైన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బాదావత్ పూర్ణచందర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని రోటిగూడ గ్రామంలో వరద బాధిత కాలనీలలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. గ్రామంలో ఎలాంటి అవసరాలు ఉన్న పూర్ణ యువసేన సభ్యులను సంప్రదించాలని ప్రజలను కోరారు. ప్రజలకు అనునిత్యం అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో రోటిగూడ మాజీ సర్పంచ్ ఉప్పు శీను, నాయకులు కొత్తూరుపల్లి సత్యం, పూర్ణ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ప్రవాహాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రవాహల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా వాగులు దాటే ప్రయత్నాలు చేయకూడదని జిల్లా ప్రత్యేక అధికారి హనుమంతరావు, కలెక్టర్ బోర్కడే హేమంత్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి సూచించారు. మండలంలోని తుంపెల్లి వాగు ప్రవాహాన్ని ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవాహాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసరంగా ఎవరు కూడా వాగులు దాటే ప్రయత్నాలు చేయకూడదన్నారు. పోలీసులు ప్రవాహాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులు గోదావరి వైపు వెళ్లొద్దు

నవతెలంగాణ-జన్నారం

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి 26 గేట్లు, కడెం ప్రాజెక్టు 11 గేట్లు ఎత్తడంతో భారీగా వరద నీటి గోదావరిలోకి వస్తుందని అటువైపుగా పశువుల కాపరులు, మత్స్యకారులు వెళ్లకూడదని ఎస్సై పి సతీష్, బ్లూకోట్ పోలీస్ అజ్మీర తిరుపతి సూచించారు. శుక్రవారం మండలంలోని కలమడుగు గ్రామంలోని గోదావరి నది బ్రిడ్జిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గోదావరిలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో కొట్టుకుపోయే ప్రమాదముందన్నారు.

ఏకగ్రీవంగా గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - జైపూర్

నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం మిట్టపల్లి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా అధ్యక్షులు కొట్టాల నాగరాజు పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా గోదారి రాజలింగు, ఉపాధ్యక్షులుగా లింగాల రాజయ్య ప్రధాన కార్యదర్శిగా జింబిడి కిరణ్‌కుమార్, కార్యదర్శిగా దూట రాజబాబు, కార్యవర్గ సభ్యులుగా అల్లూరు వెంకటస్వామి, దూట పోషముల్లు, దూట చిన్నయ్య ఎన్నికయ్యారు. మహిళా కమిటీ అధ్యక్షురాలుగా జనగామ రజిత, యూత్ కమిటీ అధ్యక్షులుగా జిమ్మిడి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సగం రమేష్, దుర్గం లింగయ్య పాల్గొన్నారు.

వరద మిగిల్చిన నష్టం..!

- కోతకు గురైన రోడ్లు..కొట్టుకుపోయిన వంతెనలు
- నేలకూలిన ఇండ్లు..నీటిలోనే పంట పొలాలు
- అతలాకుతలమైన పరివాహక ప్రాంతాలు
- కడెం ప్రాజెక్టును పరిశీలించిన కేంద్ర బృందం
- నష్టం అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను వరద కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రాజెక్టులు, నదుల్లో నీటి ప్రవాహం కాస్త తగ్గినా..అవి సృష్టించిన విలయం తాలుకూ జాడలు మాత్రం మిగిలే ఉన్నాయి. రాత్రి వేళలో వర్షం కురుస్తుండటంతో ఇంకా నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరద తాకిడి తట్టుకోలేక అనేక చోట్ల రహదారులు కోతకు గురికాగా.. వంతెనలు కొట్టుకుపోయాయి. ఫలితంగా పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాల్లో ఇండ్లు కూలిపోవడంతో నిరుపేదలు నిర్వాసితులయ్యారు. మరికొన్ని చోట్ల ఇండ్లలోకి వరద నీరు రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నదులు, వాగులు, వంకల పరివాహక ప్రాంతాలను వరద ముంచెత్తడంతో పంట పొలాలు ఇప్పటికీ నీటిలోనే మగ్గిపోతున్నాయి. వరద వెళ్లిన తర్వాత ఆయా ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. తాజాగా కడెం ప్రాజెక్టును కేంద్ర డ్యాం సెఫ్టీ బృందం అధికారులు పరిశీలించారు. నష్టపోయిన పంటలు..కొట్టుకుపోయిన వంతెనలు, విద్యుత్ స్తంభాలను అధికారులు పరిశీలిస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి నష్టం అంచనా వేస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అతలాకుతలం చేశాయి. ఈ వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. సిరులు కురిపించాల్సిన పంట పొలాలు నీటి పాలు కావడంతో అన్నదాతలకు తీరని నష్టం మిగిల్చింది. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ముఖ్యంగా వరద తాకిడికి పలు చోట్ల వాగులపై ఉన్న వంతెనలు కొట్టుకుపోవడం.. రహదారులు కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాలను గోదావరి వరద ముంచెత్తడంతో పలు కాలనీలు నీళ్లలోనే మగ్గిపోతున్నాయి. భైంసా మండలంలో సిరాల చెరువు కట్ట తెగిపోవడంతో సమీప పంట పొలాలు కొట్టుకుపోయాయి. బేల మండలం దేవుజిగూడ, దౌన వద్ద బ్రిడ్జిలు తెగిపోయాయి. ఫలితంగా రేణిగూడ, దౌన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తలమడుగు మండలం బరంపూర్ వద్ద వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సుంకిడి, తలమడుగు, కోడద్‌తో పాటు ఆదిలాబాద్ గ్రామీణ మండలం చించుఘాట్ వద్ద వంతెనలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వీటితో పాటు ఇంద్రవెల్లి, ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్ మండలాల్లో పలు చోట్ల రోడ్లు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలవాలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.

వంటలకు తీరని నష్టం..!

ఏపుగా పెరుగుతున్న దశలో వచ్చిన భారీ వర్షాలు పచ్చని పంటలను కోలుకోలేకుండా పోయాయి. ఇప్పటికే నెల రోజుల క్రితం వర్షాభావ పరిస్థితుల కారణంగా పొలంలో వేసిన విత్తనాలు నష్టపోగా.. తాజాగా పంట పెరిగిన తర్వాత వచ్చిన భారీ వర్షాలు మొలకలను లేకుండా చేశాయి. నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో అనేక చోట్ల పంటలు కొట్టుకుపోగా.. మిగితా ప్రాంతాల్లో రోజుల తరబడి నీళ్లలో ఉండటంతో అక్కడే మురిగిపోయి ఎదుగలేని దశకు చేరుకున్నాయి. పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో పంట నష్టపోయిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించగా.. తాజాగా వర్షాలు ఏకధాటిగా కురుస్తుండటంతో పంట నష్టం మరింత అధికమయ్యే అవకాశం ఉంది. దీంతో వ్యవసాయ, విద్యుత్, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, నీటిపారుదల, రెవెన్యూ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నష్టం అంచనా వేస్తున్నారు. నష్టపోయిన పంటలతో పాటు దెబ్బతిన్న కల్వర్టులు, రహదారులు, విద్యుత్‌స్తంభాలను పరిశీలించి నష్టం వివరాలను నమోదు చేస్తున్నారు. రూ.కోట్లలో నష్టం జరగడంతో ప్రభుత్వం నుంచి పరిహారం అందజేస్తేనే రైతులు, నష్టపోయిన ప్రజలకు కాస్త ఉపశమనం లభిస్తుంది. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



తుంపల్లి మొరం వాగులో ఇద్దరు గల్లంతు

- కొనసాగుతున్న గాలింపు చర్యలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని తుంపల్లి మొరంవాగులో ప్రమాదవశాత్తు పడిన బాలుని రక్షించే క్రమంలో మరొక వ్యక్తి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తుంపల్లి గ్రామంలోని రేకల దత్తు-మౌనిక చిన్న కుమారుడు కౌశిక్(11) తన స్నేహితుడు ప్రణీత్‌తో కలిసి వాగు వైపు వెళ్లారు. ఇదే సమయంలో వాగు వద్ద కాళ్లకు బురద అంటడంతో బ్రిడ్జి పక్కన గల బాట ప్రాంతంలో కాళ్లు కడుక్కోవడానికి ఇద్దరు వెళ్లారు. కౌశిక్ ఒక కాలు ఒడ్డుపై ఉంచి మరో కాళు కడిగే ప్రయత్నం చేయగా జారి వాగులో పడిపోయాడు. వెంటనే ప్రణీత్ ఒడ్డుకు వచ్చి ఒడ్డున ఉన్న గూడెన్‌ఘాట్ గ్రామస్తులు సాయి, సుధాకర్, లింగేష్‌కు చెప్పగా వెంటనే వారు అప్రమత్తమై ఒడ్డుపై నుండి కింది ప్రాంతానికి చేరుకుని నీటిలో దూకారు. 500 మీటర్ల వరకు వాగు ప్రవాహంలో ఈత కొడుతూ వెళ్లినప్పటికీ బాలుని సమాచారం దొరకకపోవడంతో ఒడ్డుకు చేరుకున్నారు. ఈ విషయం తెలియక అక్కడే ఉన్న గారె మోహన్(40) బాలుని రక్షించడానికి నీటిలో దూకాడు. కొంత దూరం ఈత కొట్టిన తర్వాత మోహన్ కనిపించలేదు. ఇరువురు కూడా కనిపించకపోవడంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మోహన్ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తుండగా భార్య లలిత, ఇద్దరు కుమారులు ఇస్తారి, మెంగు ఉన్నారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గల్లంతు కావడంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రెస్క్యూ టీం ద్వారా గాలింపు చేపట్టడానికి అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. వాగు ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర చూసినప్పటికీ ఇద్దరు వ్యక్తులు దొరకకపోవడంతో నీటిలో ఎక్కడైనా ఇరుక్కుపోయారని గాలింపు చర్యలు చేపడుతున్నారు. అయితే ఉదయం సంఘటన జరిగి సాయంత్రం నాలుగు గంటల వరకు కూడా గాలింపు చర్యలు ముమ్మరం చేయకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాగు వద్ద పరిస్థితిని జిల్లా ప్రత్యేక అధికారి హనుమంతరావు, జిల్లా పరిషత్ చైర్పర్సన్ కోవలక్ష్మి, జిల్లా కలెక్టర్ బోర్కడ హేమంత్, ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, జెడ్పిటిసి నాగేశ్వరరావు, ఎంపిపి మల్లికార్జున్ పరిశీలించారు. గ్రామానికి చెందిన ఇద్దరు ఒకేసారి గల్లంతు కావడంతో గ్రామం శోక సంద్రంలో మునిగింది. అంతవరకు కళ్ల ముందు ఆడుకున్న బాలుడు కౌశిక్, వ్యవసాయ పనిముట్ల తయారీ కోసం ఆసిఫాబాద్ వచ్చి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో మోహన్ గల్లంతు అయిన సంఘటనను గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

- ఈయూ రీజినల్ గౌరవ అధ్యక్షులు కలవేని శంకర్



ఆసిఫాబాద్ : రాష్ట్ర సాధనలో అత్యంత కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని, వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ గౌరవ అధ్యక్షులు కలవేని శంకర్ అన్నారు. సేవ్ ఆర్టిసి నినాదంతో జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రి సత్యనారాయణ, సిఐటియూ జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్, బిఎస్పి జిల్లా ఇన్చార్జి పొన్నాల నారాయణ, నియోజకవర్గ అధ్యక్షులు బుక్యరాజు, టిడిపి జిల్లా కార్యదర్శి ఆత్మారావు, సిపిఐ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు తిరుపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులపై ప్రభుత్వానికి సవతి తల్లి ప్రేమ సరికాదని, ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించి, బడ్జెట్లో రెండు శాతం నిధులు కేటాయించాలన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ ఆర్టీసీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పేస్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు దాన్ని అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు పెండింగులో ఉన్న రెండు పిఆర్సిలను వెంటనే అమలు చేయాలని, 2013 పిఆర్సి బాండ్లకు చెందిన డబ్బులను వెంటనే రిలీజ్ చేయాలని పేర్కొన్నారు. ఆర్టీసీకి రావాల్సిన 3000 కోట్ల బకాయిలు వెంటనే ఇవ్వాలని, రాయితీలు ఇవ్వాలని, సిసిఎస్‌లో ఇవ్వాల్సిన మొత్తాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పని ఒత్తిడి, వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డులు కేవలం పైరవీలకే పరిమితమయ్యాయని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీని ప్రజా రవాణా సంస్థగా చూడాలని, లాభనష్టాలతో సంబంధం లేకుండా ఆర్టీసీని కొనసాగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఆర్టీసీ సంస్థ రక్షణ, కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటాలకు కార్మికుల సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి టీ దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, నాయకులు జి మోహన్ బాబు, లక్ష్మణ్, అజిత్ పాషా, ఎండి అలీ పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ-హాజీపూర్

స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించి అందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు ఆధ్వర్యంలో నాలుగు రోజులు సమ్మె చేస్తున్న స్వీపర్లు శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ జిల్లా పరిషత్‌కు అనుబంధంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్స్‌గా 35 ఎండ్ల నుండి పని చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో తరగతి గదులు ఊడ్చడం, అన్నీ శుభ్రంగా ఉంచడంలో వీరి పాత్ర కీలకమన్నారు. సమస్యలు పరిష్కరించాలని 4 రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. నేటికీ ప్రభుత్వం రూ.4000 మాత్రమే చెల్లిస్తోందన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, నారాయణ, వెంకటేష్, గంగన్న, వెంకటేష్, లింగన్న, పద్మ పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

నవతెలంగాణ-జన్నారం

కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయం చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలపై జరిగే అఘాయిత్యాలపై అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయకలేక పోతోందన్నారు. ఆదివాసీ మహిళలపై లైంగికదాడులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లిన రాహుల్ గాంధీని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మణిపూర్ ఘటనపై బిజెపి నాయకురాలు, మాజీ ఎంపీ విజయశాంతి స్పందించడం శుభపరిణామమన్నారు. ఆదివాసి తెగకు చెందిన ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు సోయం బాపురావు స్పందించకపోవడం శోచనీయమన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు బోర్లకుంట ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫసిఉల్లా, ఎంపీటీసీ కరుణాకర్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్ చారి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఇందయ్య, పట్టణ అధ్యక్షులు దుమ్మర్ల రమేష్, అల్లం వెంకటరాజాం పాల్గొన్నారు.

వరద బాధితులకు బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ

కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముజఫర్‌ఖాన్ మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీలో శుక్రవారం వరద బాధితులకు బ్రెడ్లు, బిస్కెట్లను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు డి.రమేష్, నాయకులు అజార్, హేమంత్ చారి, మంద రాజేష్, రాహుల్ యాదవ్, రోహిత్‌దాస్ పాల్గొన్నారు.

జీఎం దేవేందర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో బెల్లంపల్లి ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులు బదిలీపై వెళ్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం జి దేవేందర్‌ను ఘనంగా సన్మానించారు. ఒక్కొక్కరిగా జీఎం సేవలు, విధి నిర్వహణను కొనియాడారు. ఈ సందర్భంగా జీఎం బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి సాధన కోసం చేసిన కృషి, ఉద్యోగుల సహకారాన్ని వివరించారు. అనంతరం విభాగాల అధిపతులు శాలువాలతో జీఎంను ఘనంగా సన్మానించి బహుమతులను, మొక్కలను బహూకరించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, బెల్లంపల్లి రీజియన్ డీజీఎం(సివిల్)(ఓసీ) నాగేశ్వర్‌రావు, పీఓ ఎన్ సత్యనారాయణ, గోలేటి ఓసీ పీఓ ఉమాకాంత్, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, ప్రాజెక్టు ఇంజనీర్ రాజాజీ, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, డీజీఎం ఎఫ్అండ్ఎ రామారావు, డీజీఎం(ఎంవీసీసీ) విజయ్‌సింగ్ ఇండా, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం గోలేటి సీహెచ్‌పీ జాడె భీంరావు, సీనియర్ పర్సనల్ అధికారి జీకె కిరణ్‌కుమార్, ఐటీ మేనేజర్ నారాయణ, సెక్యూరిటీ మేనేజర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

జీఎంను సన్మానించిన ఖైరిగూడ ఓసీ ఉద్యోగులు

ఖైరిగూడ ఓసీ అధికారులు, ఉద్యోగులు, అన్ని కార్మిక సంఘాల నాయకులు బదిలీపై వెళ్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం జి దేవేందర్‌ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఓ ఎన్ సత్యనారాయణ, మేనేజర్ ప్రవీన్ పాంటింగ్, అడిషనల్ మేనేజర్ మధుసూధన్, ఫిట్ ఇంజనీర్ రాజాజీ, డీవైపీఎం నాగుల వేణు, టీబీజీకేయస్ నాయకులు కె వెంకటేశం, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం 13వ వార్డు గంగారాంనగర్ ఏరియాలోని గవర్నమెంట్ స్కూల్ చుట్టూ చెట్లు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్, కట్కూరి సత్యనారాయణ, మార్కెటింగ్ కోఆర్డినేటర్ సుదర్శన్, చైర్మన్ వంగల చక్రపాణి, కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, మండల అధ్యక్షుడు మల్లేష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ బెల్లంపల్లిలో శుక్రవారం విద్యార్థులు ఉత్సాహభరితంగా మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో బోర్డర్ ప్లాంట్స్, పూలు, క్రోటాన్, పండ్ల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, వైస్ ప్రిన్సిపాల్ రాజకుమార్, దుర్గం రమాదేవి, శ్రీరామ వర్మ, మిట్ట రమేష్, అనుముల అనిరుద్, రాకేష్, చందా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

అక్రమ బదిలీలు నిలిపేయాలి



హాజీపూర్ : ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు నిలిపి ఎేయాలని టీఎస్‌యూటీఎఫ్, డీటీఎఫ్, టీయూటీఎఫ్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అక్రమ బదిలీల నిలుపుదలకు శుక్రవారం జిల్లా విద్యాధికారి యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ అశాస్త్రీయంగా చేపట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ ఈ విషయమై పలుమార్లు డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని పేర్కొన్నారు. ఆగస్టు 5నాటికి స్పందించకుంటే డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులతో భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, జయకృష్ణ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోళ్ల రామన్న, రాజవేణు, టీయుటీఎఫ్ జాకీర్ హుస్సేన్, కిరణ్, బారిక్ పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల పరిశీలన

నవతెలంగాణ-నేరడిగొండ



వరద ముంపు ప్రాంతాలను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. శుక్రవారం మండలంలోని గుత్పాల గ్రామంలో వరద ముంపు ప్రాంత వరద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా 11 ఇండ్లు వరదకు నీటమునిగాయి. వరద బాధితుల నష్టాన్ని సర్వే నిర్వహించాలని తహసీల్దార్ పవన్ చంద్రకు ఆదేశించారు. ప్రభుత్వ మినీ గురుకుల పాఠశాల ప్రహరీ గోడ కూలీ పోవడంతో ప్రహరీ గోడను, గ్రామంలో రోడ్లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీపీ రాథోడ్ సజన్, స్థానిక సర్పంచ్ గసికంటి రవి ఉన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధే ధ్యేయం

నవతెలంగాణ-సారంగాపూర్

మార్కెట్ కమిటీ అభివృద్ధే ధ్యేయమని ఏఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం దుకాణాల సముదాయం, ప్రహరిగోడ నిర్మాణానికి రూ.కోటి13 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. త్వరలో పనులు చేపడతామని అన్నారు. విద్యుత్ స్తంభాలు విద్యుత్ లైట్లు గోదాంలు మరమ్మతుల కోసం తీర్మానించారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ దత్తురాం, కార్యదర్శి మాధవ్, డైరెక్టర్లు, ట్రేడర్స్ పాల్గొన్నారు.

ఎంపీ సోయం బాపురావును విమర్శిస్తే ఖబడ్దార్

నవతెలంగాణ-ఇచ్చోడ

ఆదివాసుల హక్కుల గురించి మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపురావును లంబాడలు విమర్శిస్తే ఊరుకునేది లేదని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీ సమాజం రాజ్యాంగ, ప్రజాసామ్య పద్ధతిలో, ప్రజా రాజకీయ న్యాయ పోరాటాలు చేస్తుంటే కొందరు జీర్ణించుకోలేక ఎంపీపై బురదజల్లే ప్రకటనలు చేయడం మానుకోవాలని తెలిపారు. లంబాడలకు ఎస్టీ హోదా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు సిడం మురళి కృష్ణ, మెస్రం దేవురావు, మాడవి భీంరావు పాల్గొన్నారు.

ఖానాపూర్ సీఐగా మోహన్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ నూతన సీఐగా దుబ్బాక మోహన్ శుక్రవారం బాధ్యతల స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ నారాయణ నాయక్ డీఎస్పీగా ప్రమోషన్ రావడంతో వెళ్లిపోయారు. ఆ స్థానంలో ఇన్‌చార్జి సీఐగా రవీందర్ నాయక్ కొన్ని రోజుల పాటు విధులు నిర్వహించారు. కాగా ఈయనను నిర్మల్ డీసీఆర్బికి బదిలీ చేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన మోహన్ గతంలో నిజామాబాద్‌లో విధులు నిర్వహించి బదిలీపై ఖానాపూర్ వచ్చారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ



నవతెలంగాణ-బేల

భారీ వర్షాలకు ఇండ్లలో నీరు చేరి నష్టపోయిన వరద బాధిత కుటుంబాలకు తహసీల్దార్ ఒక్కో కుటుంబానికి 20కిలోల బియ్యాన్ని శుక్రవారం తహసీల్దార్ సర్పరాజ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రె, సతీష్ పవార్, జక్కుల మధుకర్, బండి సుదర్శన్, సర్పంచ్ రోహిదాస్, దత్తు, ఎంపీడీఓ మహేందర్ పాల్గొన్నారు. బేల మండల కేంద్రంలోను 14 వరద బాధిత కుటుంబాలను గుర్తించి ఒక్కో కుటుంబానికి 20 కేజీల బియ్యాన్ని సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్, ఆర్ఐ గీత పంపిణీ చేశారు.

నాందేవ్ కాంబ్లే సేవలు మరువలేనివి



నవతెలంగాణ-నార్నూర్

దివంగత మాజీ డీసీసీబీ చైర్మెన్ నాందేవ్ కాంబ్లే సేవలు మరువలేనివని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. శుక్రవారం గుంజాల గ్రామంలో నాందేవ్ కాంబ్లే ద్వితీయ వర్ధంతి సభను నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా నాందేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి జిల్లాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. వర్ధంతి కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ ఆడే సురేష్, కాంబ్లే మాదవ్, కాంబ్లే ఉద్ధవ్, ఝాడే నాగోరావ్, సూర్యవంశీ పండరి, దావుల రమేష్, తుకారాం మాహారాజ్, అరవింద్ కల్వలే, కోటేగిరి విశాల్, అరికెల కేశవ్, అమర్‌నాథ్, శశాంక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం.. ఆదివాసీ ప్రాంతాల్లో రోడ్లు అస్తవ్యస్తం..



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతోనే ఆదివాసీ ప్రాంతాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు పెందుర్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చాందూరి పంచాయతీలోని కొత్తగూడ, కేస్లాగూడ, రాజులగూడ గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్డులను చూసి చలించిపోయారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి పరిస్థితి ఆదివాసీ గ్రామాల్లో ఏర్పడిందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రేఖా నాయక్ రోడ్డు సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చినప్పటికీ తన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. ఎమ్మెల్యేగా పది సంవత్సరాలు పూర్తికావస్తున్న ఎప్పుడు కూడా ఈ ప్రాంతాలను సందర్శించలేదని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఇచ్చినటువంటి హామీ హామీలు నెరవేలేదన్నారు. ఐటీడీఏ ద్వారా రోడ్డు సౌకర్యాలు కల్పించే టీఎస్పీ నిధులు పక్కదారి మళ్లించారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నటువంటి పరిస్థితులే ప్రస్తుతం కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో స్థానిక ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి స్థానిక ప్రజలు బుద్ధి చెప్పేలా కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని అన్నారు. ఆయన వెంట స్థానిక మాజీ సర్పంచ్ ఆత్రం రఘునాథ్, కాంగ్రెస్ నాయకులు మంగం విషంరావు, సిడం శేషు, రాహుల్, శ్రీనివాస్ ఆయా గ్రామాల పటేళ్లు ఉన్నారు.

కడెం ప్రాజెక్టును పరిశీలించిన కేంద్ర బృందం

నవతెలంగాణ-కడెం



కడెం ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర డ్యాం సేఫ్టీ బృందం సభ్యులు శుక్రవారం కడెం ప్రాజెక్టును పరిశీలించారు. గత సంవత్సరం జూలై మాసంలో భారీ వరదలు వచ్చి ప్రాజెక్టు గేట్లు కౌంటర్ వేట్లు దెబ్బతిన్నాయి. సంవత్సరకాలం గడిచిన మరమ్మత్తులు పూర్తి కాకపోవడంతో మళ్లీ దాదాపు అదే స్థాయిలో కడెం ప్రాజెక్టుకు గురువారం జూలై 27న భారీ వరదలు వచ్చి ప్రాజెక్టు గేట్లపైనుంచి వరద ప్రవహించింది. ప్రాజెక్టుకు ఉన్న 18 గేట్లలలో నుంచి 16 మాత్రమే లిఫ్ట్ అయి మిగతా గేట్లు లేవలేని పరిస్థితిలో ఉన్నాయి. ఆ 16 గేట్ల లో 11 మాత్రమే ఎలక్ట్రికల్ మోటార్ల ద్వారా లిఫ్ట్ అయ్యాయి. మిగతా ఐదు గేట్లు స్థానిక యువకుల సహాయంతో ఎత్తారు. కడెం ప్రాజెక్టు గేట్లు లిఫ్టింగ్‌లో గత రెండు ఏండ్లుగా ఇదే పరిస్థితి ఎదురవుతుందని పలువురు పేర్కొంటున్నారు. కడెం ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 7.603 టీఎంసీలు కాగా, గురువారం ఒక్కరోజే దాదాపు 703 అడుగులు 8.3 టీఎంసీలలోకి నీటి మట్టం చేరుకుంది. అయితే సీడబ్ల్యూసీ మాజీ చైర్మెన్, డ్యాం సేఫ్టీ నిపుణులు ఏబీ పాండ్య అధ్వర్యంలో 24 మంది బృందం సభ్యులతో కలిసి ప్రాజెక్టు స్థితిగతులను పరిశీలిస్తున్నారు. భారీ వరదలకు ప్రాజెక్టు తట్టుకునే పరిస్థితుల్లో ఉందో లేదో ప్రాజెక్టు సేఫ్టీ మేజర్స్ గెట్లాలలో ఎదురైన సమస్యలు, కోతకు గురైన ప్రాంతాలను సెంట్రల్, స్టేట్ డ్యాం సేఫ్టీ బృందం సభ్యులు పరిశీలించారు. వరదలకు గెట్లలో ఎదురైన సమస్యలను ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు స్థితిగతులు సేఫ్టీ సమస్యల పట్ల స్టేట్, సెంట్రల్ ఉన్నతాధికారులకు నివేదికలు అందించినున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పరిశీలించిన అధికారులు గత సంవత్సరంలో ఎక్కడెక్కడ డ్యామేజ్ అయినయో నోటీస్ బోర్డ్‌పై కోతకురైన ఫోటోలను అధికారులు పరిశీలించారు. దీనికి సంబంధించిన సమస్యల గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు. ఈ ప్రాజెక్టును పరిశీలించిన వారిలో డీఎస్ఆర్పీ సభ్యులు ఏబీ.పాండ్యా, మాజీ చైర్మెన్, సీడబ్ల్యూసీ చైర్మెన్, డ్యామ్ సేఫ్టీ నిపుణుడు డా.పి.రామరాజు, విజయ్, టి. దేశాయ్, డ్యామ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ ఉన్నారు.

భారీ వర్షం..అపార నష్టం

- దెబ్బతిన్న రోడ్లు, ఇండ్లు, పంటలు



నవతెలంగాణ-ముధోల్

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు ప్రజలకు అపారనష్టాన్ని మిగిల్చాయి. వాగులు, వంకలు పొంగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోయా, మినుము, పత్తి తదితర పంటలు నీట మునిగిపోయాయి. గ్రామీణ అంతర్గత రోడ్లు బురదమయమయ్యాయి. భారీ అతి భారీ వర్షం కురియడంతో మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజలు ఇంటి నుంచి బయట వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది . శుక్రవారం ఉదయం వర్షం కురువక పోవడంతో ప్రజలు బయటకు వెళ్లారు. అలాగే మూడు రోజుల నుంచి కురిసిన వర్షం కారణంగా మండలంలోని గన్నోర, గ్రామంలో మూడు ఇండ్లు, రాంటెక్‌లో నాలుగు, ఆష్టా గ్రామంలో రెండు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, రెవెన్యూ అధికారులు తెలిపారు. ముధోల్‌లోని అతి పురాతన అనంత శేష సాయి ఆలయం పాక్షికంగా కూలింది. బస్టాండ్ ఏరియా సాయి మాధవ్ నగర్ కాలనీలోని నీరు చేరి జలమయమయ్యాయి. దీంతో రోడ్లన్నీ కోతకుగురయ్యాయి. మండలంలోని ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని సోయా, పత్తి, తదితర పంటలు నీటి మునిగి భారీ నష్టాన్ని మిగిల్చాయి. బోరిగాం-వడ్తాల్ వంతెనపై భారీగా వర్షం నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. ముద్గల్, మచ్కల్ రహదారి మధ్యలోని లోలెవల్ వంతెనపై వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తరోడ తండా రోడ్డు కోతకు గురైంది. గిరిజన బాలికల పాఠశాల ప్రహరీగోడ కూలిపోవడంతో ఎంపీడీఓ సురేష్ బాబు, ఎస్సై సాయికిరణ్‌లు జేసీబీతో కూలిన గోడను తొలగించారు. నష్టపోయిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. సుమారు 380 ఎకరాలు సోయా, 105 ఎకరాల ప్రత్తి నష్టం వాటిల్లిందని ఎఓ అజ్మీర భాస్కర్ తెలిపారు.

కోతకు గురైన రోడ్డు.. తాత్కాలిక మరమ్మతులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఆదిలాబాద్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజల జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. స్థానిక హరిఓంనగర్ కాలనీ సమీపంలోని వాగు భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డు కోతకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆ ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. మరమ్మతులు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. దీంతో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఆమె వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

జీఓ నెంబర్ 81ని సవరించాలి



నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ సీఎం కేసీఆర్ విడుదల చేసిన వీఆర్ఏల జీఓ నెంబర్ 81ని సవరించాలని వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తాయారోద్దీన్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విశ్వంబర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 61 సంవత్సరాలలోపు ఉన్న వారు, వారి వారసులు, ఆరోగ్యపరంగా బాగలేక ఉద్యోగం చేసే స్థితిలో లేని వారి వారసులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తాయరోద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓను సవరించి మాకు న్యాయం చేయాలని కోరారు. ఆరోగ్యం బాగులేని వీఆర్ఏల స్థానాల్లో వారి వారసులకు ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ పండరి, శారు, గణేష్, నగేష్ ఉన్నారు.

నాందేవ్ ఆశయ సాధనకు కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివంగత కాంబ్లే నాందేవ్ డీసీసీబీ చైర్మెన్ ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌక్‌లోని అంబేద్కర్ భవనంలో అన్నాభావు సాఠే అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కాంబ్లే నాందేవ్ ఆశయ సాధన కొరకు పని చేస్తున్నామని, సమాజానికి ఆయన అందించిన సేవలు మరవలేనివని అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుర్గం శేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు ఉన్నారు.

అదనపు కలెక్టర్, ఆర్డీఓను కలిసిన సనాతన సమితి సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అదనపు కలెక్టర్‌గా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన శ్యామలదేవిని, అలాగే నూతన ఆర్డీఓ స్రవంతిని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్, ఆర్డీఓను కలిసిన వారిలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి గేడం మహదేవ్, కోశాధికారి, పడకంటి సూర్యకాంత్, నాయకులు పసం రఘువేంద్ర, శశికళ చౌహాన్, ఉరాడే సుభాష్, లొలపు శ్రీనివాస్, మాదస్తు సంతోష్, బారడీ లచ్చు, బారడీ రాకేష్, రమేష్ పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్ట్ గేట్ ముందుర కాంగ్రెస్, బీఎస్‌పీ నాయకులు ఆందోళన



నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్ట్ గేట్ ముందుర కాంగ్రెస్, బీఎస్‌పీ నాయకులు ఆందోళన కార్యక్రమం శుక్రవారం నిర్వహించగా, ప్రాజెక్ట్‌లోనికి ప్రవేశం లేదని అధికారులు గేటు వేయడంతో కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు గేటు మీద నుంచి దూకి ప్రాజెక్టు స్థితిగతులను పరిశీలిస్తున్న కేంద్ర, రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ బృందం సభ్యులకు నాయకులు సమస్యలను విన్నవించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం ప్రోగ్రాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో ఈనెల 29న డయల్ యువర్ ఆర్టీసీ డీఎం ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జిల్లా ప్రజల సలహాలు సూచనలు, ఫిర్యాదుల కొరకు 9959226002 ఈ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నష్ట పరిహారం అందించాలి

నవ తెలంగాణ బేల

గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారిని వెంటనే ఆదుకోవాలని బిజెపి నాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బేల మండలంలోని సాంగ్వి గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలతో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఎకరానికి రైతుకు 20 వేలు నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే సర్వే చేపట్టాలని అన్నారు.నష్టపోయిన రైతులకు విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలనీ డిమాండ్ చేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

నవతెలంగాణ-బాసర

బాసర పుణ్యక్షేత్రం సమీపంలోని గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. అల్పపీడన ద్రోణితో ఒకరోజు కురిసిన భారీ వర్షానికి ఏగువన మహారాష్ట్రలోని విష్ణుపురి, బాబ్లీ ప్రాజెక్టు గేట్లు సైతం ఎత్తివేయడంతో వరద నీరు పోటెత్తుతుంది. గోదావరి నదిలో వరద నీరు పోటెత్తడంతో నీటి ప్రవాహాన్ని చూసేందుకు యాత్రికులు భారీగా తరలివస్తున్నారు. గోదావరి పరివాహక ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్, రెవెన్యూ అధికారులు సూచించారు.

బీసీ ఆర్థిక చేయూతలో అవకతవకలు

- బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారంటూ ఆగ్రహం



నవతెలంగాణ-ఖానాపూర్

బీసీ ఆర్థిక చేయూత మంజూరులో అవకతవకలు జరిగాయని నిరసిస్తూ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట డీఆర్వో లోకేష్ కుమార్‌ను ప్రతిపక్ష నాయకులు నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు చెప్పిన వారికే ఆర్థిక సాయం ఇచ్చారని అన్నారు. లబ్దిదారుల ఎంపిక ఏ ప్రతిపాదికన చేశారో తెలుపాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ఎంత మంది లబ్దిదారులకు ఇచ్చారో తెలియజేయాలని పట్టుబట్టారు. ఇందులో కూడా పేదలకు అన్యాయం జరిగిందని అన్నారు. సంబంధిత అధికారిని అడ్డుకుని ప్రశ్నించగా సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టాలని లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో కాంగ్రెస్ మండల అధ్యక్షులు దయానంద్, కౌన్సిలర్లు రాజుర సత్యం, కిషోర్ నాయక్ నాయకులు షబ్బీర్ పాషా, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, తోట సత్యం, శెట్టి శ్యామ్‌రావు ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- పీహెచ్‌సీ వైద్యులు రాహుల్ గడపాలే



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యులు రాహుల్ గడపాలే అన్నారు. శుక్రవారం అల్లికోరిలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని అన్నారు. వర్షాలతో రోడ్డు దెబ్బతిని రోడ్డు సౌకర్యం లేకపోయినప్పటికీ వాగుదాటుతూ వెళుతూ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆరోగ్య సహాయకులు పవర్ ప్రేమ్ సింగ్, రాథోడ్ నారాయణ, సత్యవతి, శైలజ, ఎంఎల్‌హెచ్‌పీ కళ్యాణ్, ఆశా కార్యకర్త చంగునాబాయి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

కుభీర్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు వసుంధర అన్నారు. శుక్రవారం మండలంలో పార్డి(బి), సోమేశ్వర గ్రామంలో వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధుల పట్ల అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పలు కాళీ స్థలాల్లోని పిచ్చిమొక్కలు ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసి నీళ్లు నిల్వకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దీంతో నీళ్లు నిలకడగా ఉన్న ప్రదేశాల్లో దోమలు అధికంగా ఉండటంతో వాటి ద్వారా మనం తినే భోజనంలో వచ్చే అవకాశం ఉందని, దీంతోనే సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తూము పుష్పలత రాజేశ్వర్, పార్డి(బి) సబ్‌సెంటర్ వైద్యులు ప్రహ్లాద్, ఆశ వర్కర్స్ అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

సదర్‌మాట్ కెనాల్‌కు గండ్లు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి సదర్‌మాట్ కెనాల్‌కు గండ్లు పడ్డాయి. ఖానాపూర్ ప్రాంతంలో రెండుచోట్ల, దిలావర్‌పూర్ ఏరియాలో రెండుచోట్ల గండ్లు పడ్డాయి. గతేడాది ఇదే సమయంలో కురిసిన వర్షాలకు గండ్లు పడి ఆయకట్టుకు నీరు విడుదల కాక రైతులు ఖరీఫ్ పంట సాగు చేసుకోలేకపోయారు. ఇప్పుడు అదే దుస్థితి నెలకొనడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గతంలో గండ్లు పడిన చోటనే రెండు గండ్లు పడగా, కొత్తగా మరో రెండుచోట్ల గండ్లు పడ్డాయి. దిలావర్‌పూర్ ప్రాంతంలో పడ్డ గండి దాదాపు 25 అడుగుల వరకు కట్ట కోతకు గురైంది. గతేడాది చేసిన గండ్ల మరమ్మతు పనులను నాణ్యతగా చేయని కారణంగానే ఇప్పుడు అదేచోట గండ్లు పడ్డాయని రైతులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ ఇష్టారీతిన పనులు చేయడంతో పాటు అధికారుల పర్యవేక్షణ లేకపోడంతోనే పనులు నాసిరకంగా చేసినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. ఈసారి ఖరీఫ్ పంటసాగుపై రైతుల్లో ఆందోళన నెలకొంది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ-ఖానాపూర్

భారీ వర్షాల కారణంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం ఎమ్మెల్యే రేఖా నాయక్ పర్యటించారు. ఖానాపూర్ మండలంలోని పాత తర్లపాడ్, గోసంపల్లె, గోడలపంపు, దిలావర్‌పూర్, గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి, దెబ్బతిన్న రోడ్లను, ఇండ్లను పరిశీలించి, వారిని పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఇండ్లు కూలిపోయిన బాధితులకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
శనివారం 29 జులై 2023

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కాలువలు నిండిపోయి వర్షపు నీరు రోడ్లపై వస్తున్నందున లోతట్టు ప్రాంత ప్రజల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్ కాలనీలోని గోదావరిని, ఊరు చెరువు మొత్తాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఈసంపల్లి ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, నస్పూర్ తహసిల్దార్ జ్యోతితో కలిసి పరిశీలించారు. అనంతరం లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, రానున్న రోజులలో భారీ వర్షాలు ఉన్నాయని, శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమానులు సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. నస్పూర్ పట్టణ ప్రజల వరద నీటి ప్రభావం దృష్ట్యా నస్పూర్ మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యార్థం పునరావాస కేంద్రలను ఏర్పాటు చేశామన్నారు.

రేగులగూడలో వైద్య శిబిరం

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్



రేగులగూడ గ్రామంలో శుక్రవారం స్వర్ణ ఫౌండేషన్, సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ బానుప్రకాష్ పేపర్ మిల్లు వైద్య సిబ్బంది గ్రామం లోని ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్, సర్పంచ్ ఆత్రం రమేష్, కార్యదర్శి గజ్జి రమేష్, బీంరావు, మిల్లు హాస్పిటల్ సిబ్బంది జయసింహ, తన్నీరు విజయ్, శ్రీనివాస్, ఏఎస్ ఎం లక్ష్మి పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని పారుపల్లి దగ్గర గోదావరి వరద ప్రవాహాన్ని జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోళికేరి శుక్రవారం పరిశీలించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నది పరివాహక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. సమాచారం తెలుసుకున్న జిల్లా ప్రత్యేక అధికారి సందర్శించి ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ప్రజలతో దగ్గరగా ఉండాలని, ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ప్రజలకు సేవ చేయాలని ఆదేశించారు. ముంపుకు గురైన గ్రామ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ అజ్గర్, అడిషనల్ కలెక్టర్ రాహుల్, తహసీల్దార్ సునీల్ దేశ్‌పాండే, ఎంపీడీవో భాస్కర్ పాల్గొన్నారు.

యూనియన్ సభ్యత్వ నమోదు బాధ్యతాయుతంగా చేపట్టాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంఘంలో సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా చేపట్టాలని టిఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దీని కోసం సభ్యత్వ నమోదు ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. భవిష్యత్తులో కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుకర్ పాల్గొన్నారు.

జోడేఘాట్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వినతి

నవతెలంగాణ-కెరమెరి

జోడేఘాట్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని శుక్రవారం కుంరం భీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఎంపీపీ మోతీరాంను కలిసి వినతి పత్రం అందజేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు హట్టి నుండి జోడేఘాట్ వరకు రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడ్డాయయని ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడక్కడ కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జోడేఘాట్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఎంపీపీకి వినతిపత్రం అందించిన వారిలో గిరిజన సంఘం నాయకులు సెడ్మకి తుకారం, భీంరావు పాల్గొన్నారు.

కిర్డీలో పర్యటించిన జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి

నవతెలంగాణ-వాంకిడి

కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కిర్డీ గ్రామానికి వెళ్లే రెండు రహదారుల మధ్యలో ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతుండడంతో శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి గ్రామానికి వెళ్లి అక్కడున్న పరిస్థితులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వర్షం కురిసినప్పుడల్లా రెండు వైపుల నుండి వచ్చే ఒర్రెల నీరు ఇండ్లలోకి చేరి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికే చాలామంది ఇండ్లలోకి నీరు చేరడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారన్నారు. స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ త్వరలోనే గ్రామానికి వెళ్లే రహదారులకు ఇరువైపుల వంతెనలు నిర్మించి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆమెతో పాటు జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సరండి సర్పంచ్ కమలాకర్, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామ పంచాయతీలో సర్పంచ్ పెందోర్ పవన్ అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని చిన్న, సన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. రైతులకు 14 రకాల పండ్ల తోటలు ఏర్పాటు చేయడానికి తగు సూచనలు, సలహాలు చేశారు. దీనికి సంబంధించిన రైతులు వివరాల కోసం వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు తిరుపతి, మనోహర్, ఈశ్వరిబాయి, ఫీల్డ్ అసిస్టెంట్ రోహిదాస్, రైతులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

నవతెలంగాణ -వేమనపల్లి

మావోయిస్టు సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం కల్లంపల్లి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. వాహన పత్రాలు సరిగా లేని 18 బైక్‌లు, 2 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మావోయిస్టు సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. యువకులు సంఘ విద్రోహ శక్తులకు సహకరించవద్దన్నారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయమన్నారు. ఎవరైన ఆపదలో ఉంటే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. మావోయిస్టుల ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నీల్వాయి ఎస్ఐ సుబ్బారావు, కోటపల్లి ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల అష్టదిగ్బంధం

- వర్షం తక్కువ ఉన్నా మునక తప్పని వైనం
- జిల్లా కేంద్రంలో లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లలోకి చేరిన వరద

నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలో అతివృష్టి నెలకొంది. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు పొరుగున ప్రాజెక్ట్‌ల నుండి వస్తున్న వరదలకు జిల్లా అతలాకుతలమైంది. ఎల్లంపల్లి వరద గేట్లు ఎత్తడంతో జిల్లా కేంద్రంలోని పలు కాలనీలు నీటమునిగాయి. రాంనగర్, ఎల్ఐసి కాలనీ, ఎన్టీఆర్ నగర్, పద్మశాలివాడ, హమాలివాడ, రాళ్లపేట్‌లోని ఎక్కువ సంఖ్యలో ఇండ్లు నీట మునిగాయి. అధికార యంత్రాంగం వీరిని సురక్షిత ప్రాంతాలకు తరలిలించారు. గురువారం రాత్రి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ 48గేట్లు తెరవడంతో జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలు తగ్గుముఖం పట్టినా ఎగువన శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్ట్‌ల గేట్లు ఎత్తడంతో ఎల్లంపల్లికి భారీగా వరద నీరు చేరింది. సుమారు 9లక్షల క్యూసెక్కుల వరద నీరు ఎల్లంపల్లి రావడంతో అధికారులు 48గేట్లు ఎత్తి నీటిని దిగువ గోదావరికి వదిలారు. దీంతో మంచిర్యాల పట్టణ పరిధిలోని పలు కాలనీలు నీట మునిగాయి.

మునిగిన మాతాశిశు కేంద్రం

జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆసుపత్రి పూర్తిగా గోదావరి వరద ఉధృతిలో కూరుకుపోయింది. రెండు ఫ్లోర్‌ల బిల్డింగ్ ప్రస్తుతం ఒక్క ఫ్లోర్ మాత్రమే కనబడుతోంది. మూడు రోజుల క్రితమే స్థానిక కాంగ్రెస్, టీఆర్ఎస్ నాయకులు పోటాపోటీగా ఆరోగ్య కేంద్రంలోని బాలింతలు, పిల్లలను ఏరియా ఆస్పత్రుకి



మాతాశిశు కేంద్రం చుట్టూ వరద నీరు



ఎమ్మెల్యే దివాకర్‌రావును నిలదీస్తున్న కాలనీవాసులు

తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. కాలేజి రోడ్డులోని శ్మశాన వాటిక ఆనవాళ్లు కూడా కనబడం లేదు. రాళ్ల వాగు పొంగి పొర్లింది. వాగును ఆనుకొని నిర్మాణం చేసిన గోడలు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. పలు ఇండ్లు కూడా కొట్టుకుపోయాయి. రెండు రోజులుగా వర్షాలు కురవడం లేదు. అయినా మంచిర్యాల పట్టణంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. ఇండ్లు నీటిలో మునిగాయి. బాధితులు కట్టుబట్టలతో సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. వర్షాలు లేవు కదా అనే ధీమాతో ఉన్న లోతట్టు ప్రాంతాల జనాలకు గురువారం రాత్రి కాళరాత్రి అయింది. ఎగువన భారీ వరదలు వస్తుండడంతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ 48గేట్లు ఎత్తి గోదావరి పోటు కమ్మీ గురువారం రాత్రి జిల్లా కేంద్రాన్ని కుదిపేసింది. గతేడాది లాగే పలు కాలనీలు నీట మునిగాయి.

ఎమ్మెల్యే నిలదీత

ముంపునకు గురైన రాంనగర్, ఎన్టీఆర్ కాలనీల్లో శుక్రవారం ఎమ్మెల్యే దివాకర్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా ముంపునకు గురైన కాలనీవాసులు ఎమ్మెల్యేను నిలదీశారు. లక్షలు వెచ్చించి కట్టుకున్న ఇండ్లు నీట మునిగితే తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే విఫలయం అయ్యారని నిలదీశారు. గతేడాది వరదల నుండి ఏం గుణపాఠం నేర్చుకున్నారని ఎదురు తిరిగారు. పోయిన ఏడాది మునిగిన ఇండ్లకు ఇప్పటికీ నష్టపరిహారం ఎందుకు అందలేదని ప్రశ్నించారు. వర్షాలు లేకున్నా మంచిర్యాల ఎందుకు మునుగుతుందో చెప్పాలని నిలదీశారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

నవతెలంగాణ - కౌటాల



అధికారులు అందుబాటులో ఉండి లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశమై అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మండలంలోని తుమ్మిడిహేటి, ప్రాణహిత నదిని పరిశీలించి పెరుగుతున్న నీటి ప్రవాహం ఆ ప్రాంత ప్రజలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహారాష్ట్రలోని ప్రాజెక్టుల గేట్లు ఎత్తడం వల్ల వార్ధా, ప్రాణహిత నదుల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున నదీ పరివాహక గ్రామాల సరిహద్దు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. తుమ్మిడిహేటి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయిన నందిపేట శ్రీధర్ ఇంటిని పరిశీలించారు. ఆ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో పంచాయతీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్య పనులపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక అధికారులదే అన్నారు. అంతేకాకుండా వరదలు పెరిగే ప్రమాదం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతాలకు ఎవరు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఆర్ఎడీఓ డీపీఓ సురేందర్, ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, తహసీల్దార్ సాయన్న, ఏపీఓ పూర్ణిమ, ఎంపీఓ మౌనిక, సర్పంచ్ మౌనీష్, చరాందాస్, కార్యదర్శి సాయికృష్ణ ఉన్నారు.

ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జిసి.సుబ్బారాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులు, ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లాలో చేపట్టవలసిన చర్యలపై సమీక్షించారు. వరద ప్రభావిత, ముంపు ప్రాంతాలలో ప్రజలకు అనారోగ్య సమస్యలు ఉన్నట్లయితే ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నం.7671001703లో సంప్రదించవచ్చని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో వైద్యాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ 24/7 వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని, వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బందికి సెలవులు రద్దు చేయడం జరిగిందని, అత్యవసర సేవలలో వెంటనే స్పందిస్తూ ప్రజలకు భరోసా కల్పించాలని అన్నారు. అన్ని రకాల మందులను ఆశ కార్యకర్త వరకు అందజేయాలని, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో 21 ఆరోగ్య కేంద్రాలలో ఎపిడమిక్ సెల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా కార్యాలయంలో డిఎస్ఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని, ఈ సెల్స్ 24 గంటలు పని చేస్తాయని తెలిపారు. జిల్లాలో 27 వరద ప్రభావిత గ్రామాలను గుర్తించడం జరిగిందని, ఈ క్రమంలో హై రిస్క్ గ్రామాల నుండి 17 మంది గర్భవతులను ఆసుపత్రులకు తరలించడం జరిగిందని, వీరిలో 8 మంది ప్రసవించగా మిగతా 9 మందిని వారి ప్రసవ తేదీ ప్రకారంగా పర్యవేక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, పర్యవేక్షకులు విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానం ద్వారా గుణాత్మక మార్పులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చిన ఈ మూడేళ్ల కాలంలో విద్యారంగంలో గుణాత్మక మార్పులు చోటు చేసుకున్నట్లు జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి చక్రపాణి అన్నారు. జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చి మూడేళ్లు పూర్తయ్యిన సందర్భంగా శుక్రవారం విద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యలో విద్యార్థులకు విమర్శనాత్మక, వివేకావంతమైన ఆలోచనలను ఆచరణాత్మక బోధనా పద్ధతుల ద్వారా వివరించి చెప్పడం జరుగుతోందని అన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను పెంచడమే ఈ జాతీయ విద్యావిధానం లక్ష్యమని అన్నారు. ఈ విధానం ద్వారా ఉపాధ్యాయ విద్యలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయుల కొరత దేశాన్ని, భావిభారత భవిష్యత్తును సవాలు చేయడాన్ని గమనించిన ప్రభుత్వం వైద్య, ఇంజనీరింగ్ కోర్సులలాగానే నాలుగేళ్ల కోర్సులను ప్రవేశపెట్టి 2030 నాటికి నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులను తయారుచేసే విధంగా ఈ విద్యావిధానం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహంతో పాటు నవోదయ అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యా శాఖ నోటీసులు అప్రజాస్వామికం

నవతెలంగాణ - హాజీపూర్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో, కెజీబీవీలో, మోడల్ స్కూల్స్, గురుకులాల్లోకి డిఈఓ అనుమతి లేకుండా లోపలికి రావడానికి అనుమతి లేదని విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, తిరుపతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ యూనిఫామ్‌లు ఇవ్వలేదన్నారు. ఆశ్రమ పాఠశాలలు, కెజిబివిల్లో పాఠ్యపుస్తకాలు రాలేదన్నారు. పాఠశాలల్లో సమస్యల గురించి తెలుసుకొని పోరాడేవారిని రావొద్దని ఆంక్షలు పెట్టడం సమంజసం కాదన్నారు. వెంటనే ఆదేశాలు వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఆసిఫాబాద్ : సమస్యలు పరిష్కారం చేయకుండా బయట వ్యక్తులు రావొద్దని విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడం సరికాదని, వెంటనే వాటిని వాపసు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కెజీబివి, మోడల్ స్కూల్స్‌లోకి డిఇఓ అనుమతి లేకుండా లోపలికి రావడానికి అనుమతి లేదని విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలన్నారు. సాక్ష్యాత్తు సిఎం మనుమడే గచ్చిబౌలి బాలికల పాఠశాల గురించి వివరించి టాయిలెట్స్ లేకపోవడంతో మరమ్మతులు చేయించారని గుర్తు చేశారు. సమస్యలను తెలుసుకొని అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే విద్యార్థి సంఘాలను అడ్డుకోవడం సరికాదని, వెంటనే ఉత్తర్వులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తీవ్ర వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి రామక్రిష్ణ సూచించారు. బారెగూడ శివాపూర్‌లో శుక్రవారం పర్యటించి పంటలను పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున వాగు పరివాహక ప్రాంతాలు, పంట చేనులకు వెళ్లకూడదని కోరారు. వర్షాలు తగ్గిన తరువాత పంటలకు వేయాల్సిన ఎరువులను వివరించారు. రైతులు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు బీమాకు ఆగస్టు 5లోపు ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీఎం- కిసాన్ డబ్బుల కొరకు ఈకేవైసీ చేసుకోని రైతులు తప్పకుండా ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. పంట సాగు వివరాలను ఏఈఓలకు తెలిపి ఆన్లైన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్లె సంతర్, దేవిదాస్, రైతులు పాల్గొన్నారు.

7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆగస్టు7న జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహించాలని క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ జి.వెంకటనారాయణకు పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు వనం సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా అధికారికంగా జరపాలని, గాంధీజీ లాంటి మహోన్నత వ్యక్తి రాట్నం వడికి నూలు పోగుతో తయారు చేసిన ఖద్దరు వస్త్రాలను ధరించారని పేర్కొన్నారు. దేశంలోనే ఖాదీ వస్త్రాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని అన్నారు. చేనేత రంగానికి గుర్తింపు ఉండాలనే ఆలోచనతో ప్రధానమంత్రి మోడీ చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని అన్నారు. పద్మశాలి చేనేత కార్మికుల ఆత్మ గౌరవాన్ని కాపాడుటకు జాతీయ చేనేత దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి స్టీరింగ్ కమిటీ సభ్యులు బూర సారంగపాణి, ఉపాధ్యక్షులు అక్కేపెల్లి సమ్మయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండకుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులకు సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

జులై 31న పదవీ విరమణ పొందుతున్న అధికారులను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పదవి విరమణ పొందుతున్న కార్పొరేట్ జనరల్ మేనేజర్ సిహెచ్‌పి(కార్పొరేట్) స్వామి నాయుడు, జనరల్ మేనేజర్(ఈ అండ్ ఎం), ఎస్ఓ టూ జీఎం సూర్యకుమార్, జనరల్ మేనేజర్ సెంట్రల్ వర్క్‌షాప్ ఎల్వి గణపతిరావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని తమ నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని సంస్థ అభివృద్ధికి తోడ్పడేలా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వర్క్ షాప్, ఎనర్జీ మేనేజ్మెంట్ అండ్ ఓసీపీ నాగేశ్వరరావు, ఎస్ఓ టూ జీఎం రఘుకుమార్, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఇన్చార్జి ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్సు మురళీధర్, ఏజెంట్లు ఏవీరెడ్డి, గోపాల్ సింగ్, రాముడు, డీజీఎం (ప) పి అరవిందరావు, డీజీఎం(ఐఈడి) చిరంజీవులు పాల్గొన్నారు.

జీఓ నెం. 11 ప్రకారం వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



జీఓ నెంబర్ 11 ప్రకారం తమకు వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎస్పీఎం నర్సరీ కార్మికులు శుక్రవారం నర్సరీ మేనేజర్‌తో పాటు మిల్లు యాజమాన్యానికి వినతిపత్రం అందించారు. నర్సరీలో సుమారు 150 మంది కార్మికులు పని చేస్తున్నారనీ, మొక్కలు పెంచి, ప్రాసెసింగ్ చేసి, లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేపడుతున్న తమకు కనీస వేతనాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. తోటి ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులతో సమానంగానైనా వేతనాలు చెల్లించకుండా కేవలం రూ. 325 చెల్లిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఎనిమిది గంటలలో కేటాయించిన 66 బ్లాక్‌ల పని పూర్తి చేస్తేనే ఈ వేతనం చెల్లిస్తారని, ఈ పని పూర్తి చేయాలంటే ఇంకా గంట, రెండు గంటలు అదనంగా పని చేయాల్సి వస్తోందని వారు వాపోయారు. ఈ నెల 19న తాము పని నిలిపివేసి ఆందోళన చేపడితే వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని, మరో వారం రోజులలో సమస్య పరిష్కారం కాకపోతే తాము నిరవధిక ఆందోళన చేపడతామని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

బాలుడు గల్లంతుపై కార్యదర్శి, వీఆర్‌ఏ సస్పెన్షన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తుంపల్లి వాగులో బాలుడి గల్లంతుపై విధుల్లో నిర్లక్ష్యం వహించారని గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవికతో పాటు వీఆర్ఏ వినోద్, శంకర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి సురేందర్ తెలిపారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 29 జులై 2023

ఫారెస్ట్ అధికారులపై దాడి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఫారెస్ట్ అధికారులపై పోడు వ్యవసాయ రైతులు సోన్‌కాంబ్లే విలాస్, సందర్శ్‌లు దాడి శుక్రవారం చేశారని ఎస్సై డి. సునిల్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంపార్ట్‌మెంట్ నెం.373.లో హరితహారం మొక్కలు పెంపకానికి ఆ సెక్షన్ అధికారి నర్సయ్య ట్రాక్టరు తీసుకుని వెళ్లారు. ఇది గమనించిన ఆప్రాంత రై తులు ఆయనపైనే దాడి చేశారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషనులో ఇరువర్గాలు ఫిర్యాదు చేశారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ఫారెస్ట్ అధికారులపై దాడులు చేస్తే విధులు ఎలా నిర్వహించాలని వారు పేర్కొన్నారు. డీఎఫ్ఓ చంద్రశేఖర్ వారిని సముదాయించారు.

నష్ట పరిహారం అందించాలి

నవతెలంగాణ-బేల

నష్ట పరిహారం అందించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత అన్నారు. శుక్రవారం పెన్‌గంగా నది వరద ప్రభావిత ప్రాంతాలైన బెదోడ, గూడా, మనియార్‌పూర్, మాంగ్రూడ్, ఖోగ్దూర్ గ్రామాల్లో పర్యటించారు. భారీ వర్షాలతో పెన్‌గంగా నది ఉప్పొంగడంతో భారీగా పంట నష్టం జరిగిందని అన్నారు. కొన్ని గ్రామాలు నీటిలో మునిగాయని, వారికి తక్షణ సాయం కింద ఇండ్లల్లో నీళు చేరిన వారికి రూ.10 వేలు, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, వామన్, ఘనశ్యామ్ గావండే, భోక్రే శంకర్, గోడే అవినాష్, విపిన్ ఠాక్రే, గణేష్ గోడే, గంభీర్ ఠాక్రే, నాందేవ్ పాల్గొన్నారు.

రాకపోకలను పునరుద్ధరిస్తాం



నవతెలంగాణ-కుభీర్

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో మండలంలోని గోడిసెర, హల్దా, మర్లగొండ, నిగ్వ, మలేగాం, సాంగ్వి, పార్డి(బి), పల్సి, బెల్గం, అంతర్ని, దార్‌కుభీర్ జాంగం గోడపూర్ గ్రామాల్లోని పంటలు, రహదారులు కోతకు గురయ్యాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా ఇండ్లలోకి నీరు చేరి నిత్యవసర సరుకులు తడిసిపోయాయి. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రాకపోకలను పునరుద్ధరిస్తామని అన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దత్తుగౌడ్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు విజయ్ కుమార్, సురేష్ నగలింగం, కుభీర్ ఎస్సై షరీఫ్, గ్రామస్తులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బాసర

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండల కేంద్రంలో ముంపు ప్రాంతమైన మైలపూర్ కాలనీని శుక్రవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సంబంధిత అధికారులతో చర్చించి, ప్రత్యామ్నాయ చర్యలను తీసుకుంటామని, కాలనీవాసులకు హామీ ఇచ్చారు. వర్షాలకు దెబ్బతిన్న ఓని, బాసర, కిర్గుల్(బి) బాసర రహదారి మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు సూచించారు. అంతకు ముందు ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులతో కలిసి గోదావరి నది ప్రవాహాన్ని పరిశీలించారు. వీరి వెంట సర్పంచ్ లక్ష్మణరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ కన్వీనర్ కొర్వా శ్యామ్, నాయకులు పాల్గొన్నారు.

అకాలవర్షంతో పంటపొలాలు రహదారులు ధ్వంసం

- పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



నవతెలంగాణ-కుభీర్

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గోడిసెర గ్రామానికి సమీపంలో ఉన్న రహదారి పూర్తిగా వరదతో కొట్టుకుపోయింది. అదే విధంగా పార్డి(బి), కుభీర్, కాశ్ర, డోడార్నా, కుభీర్‌తో పాటు పలు గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో మండల కేంద్రం నుంచి భైంసాకు నిత్యం వందల మంది ప్రజలు వాహనాలు వెళ్లే మార్గంలో గోడిసెర గ్రామం వద్ద రహదారి పూర్తిగా చెడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో భైంసాకు వెళ్లాలంటే కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే అధికారులు అనుమతి ఇచ్చారు. శుక్రవారం మండల తహసీల్దార్ విశ్వంబర్ మండల నాయకులతో కలిసి రహదారులు, పంటపొలాలను పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పత్తి పంట 680మంది రైతులకు సంబంధించిన 1250 ఎకరాలు, సోయా పంట 350 రైతులకు సంబంధించిన 710 ఎకరాలు, పసుపు రైతులు 15 మందికి 35 ఎకరాలు, కంది రైతులు 112 మందికి 210 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదికలు పంపించి, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

విశ్రాంత పోలీస్ అధికారి బీజేపీలో చేరిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విశ్రాంత పోలీస్ అధికారి ఆదివాసీ గిరిజన నాయకుడు సెడ్మాకి గోద్రూ బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చేరారు. వీరితో పాటు పలువురు పార్టీలో చేరారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఈయన పోలీస్ శాఖలో విశేష సేవలు అందించిన అనంతరం తన శేష జీవితాన్ని ప్రజలకు సేవలు అందించనున్నట్టు తెలిపారు.

కులమతాలకు అతీతంగా మొహరం పండుగ

నవతెలంగాణ-తాంసి

తెలంగాణ రాష్ట్రంలో అన్ని పండుగలతో పాటు మొహరం పండుగ కులమతాలకు అతీతంగా నిర్వహించుకోవడం జరుగుతుందని జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గిరిగాం, భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామాల్లో మొహరం పండుగలో పాల్గొన్నారు. భారీ వర్షాల కారణంగా ఇండ్లు పంటలకు అపార నష్టం వాటిల్లిందని అన్నారు. అన్ని పంటలను సంబంధిత అధికారులతో సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గజానన్, పార్టీ కన్వీనర్ అరుణ్, నాయకులు కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి యశ్వంత్, ధనుంజయ్, ఆఫ్రోజ్, తిరుమలగౌడ్ ఉన్నారు.

ఇష్టారాజ్యంగా చెక్ డ్యామ్‌ల నిర్మాణంతోనే పంటలకు ముప్పు

నవతెలంగాణ-సారంగాపూర్

ఇష్టారాజ్యంగా చెక్ డ్యామ్‌ల నిర్మాణంతోనే పంటలకు ముప్పు వాటిల్లిందని బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు.శుక్రవారం మండలంలోని తాంద్ర, కంకెట గ్రామంలోని నీటమునిగిన పంటలను పరిశీలించారు. స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రైతులు నష్టపోయారని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకులు, అధికారులతో కుమ్మక్కై ఇష్టారీతిన చెక్‌డ్యామ్‌లను నిర్మించడం వల్ల వర్షపు నీరు పంట పొలాలతో పాటు, రోడ్లు రహదారులు దెబ్బతిన్నాయన్నారు. ప్రజలకు రాకపోకలతో పాటు, రైతుకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. స్థానిక మంత్రి అండతో వారి అనుచరులు చేసిన అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌ఛార్జి రావుల రాంనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మ రాజు, ముత్యంరెడ్డి, నాయకులు అంజుకుమార్ రెడ్డి, బీజేవైఎం స్టడీ సర్కిల్ రాష్ట్ర కన్వీనర్ వెంకటేష్, పార్టీ మండల అధ్యక్షులు కరిపే విలాస్, ఎస్టీ మోర్చ మండల అధ్యక్షులు జాదవ్ వినోద్, బీజేపీ నాయకులు రాంశంకర్ రెడ్డి, చెన్న రాజేశ్వర్, సాహెబ్ రావు, సామల వీరయ్య, రాథోడ్ నారాయణ, రైతులు పాల్గొన్నారు.

ఆవేదన ఆలకించారు...

నివేదిక పంపిస్తామన్నారు..

- పెసరుకుంట గ్రామాన్ని సందర్శించిన జిల్లా ప్రత్యేకాధికారి హనుమంత్‌రావు, కలెక్టర్
- గర్భిణులను ముందుగా ఆస్పత్రులకు చేర్చాలని సూచన

నవతెలంగాణ - దహెగాం

రాష్ట్ర, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శిస్తే ఎంతో కొంత మేలు జరుగుతుందని ఆశపడ్డ పెసరుకుంట గ్రామానికి మళ్లీ నిరాశే ఎదురైంది. ప్రతిఏటా భారీ వర్షాలు వరదల కారణంగా ముంపుకు గురవుతున్న మండలంలోని పెసరుకుంట గ్రామాన్ని శుక్రవారం జిల్లా ప్రత్యేక అధికారి హనుమంత్‌రావుతో పాటు జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడె సందర్శించారు. ముందుగా గ్రామంలో అందుతున్న వైద్యసేవలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్పందనతో మాట్లాడారు. ముంపు గ్రామాల్లో వైద్యసేవలు అందించడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులను గుర్తించి 10 రోజుల ముందుగానే ఆస్పత్రులకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి పెద్దవాగు పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామం ప్రతి ఏటా ముంపుకు గురై గ్రామం చుట్టూ వరద నీరు చేరి ఎటూ వెళ్లలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నామని వాపోయారు. వరదల్లో పంట నష్టంతో పాటు పశు సంపద కూడా నష్టపోతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. గ్రామానికి ప్రత్యామ్నాయంగా మరో చోట ఆవాసం కల్పించాలని గ్రామస్తులంతా వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన అధికారులు ప్రత్యామ్నాయ మార్గాల కోసం స్పష్టమైన హామీ ఇవ్వకపోగా మీ ఆవేదనను ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు గ్రామస్తులతో మాట్లాడుతూ దగ్గరలో ముంపుకు గురికాకుండా ఉండే ప్రభుత్వ స్థలమేదైనా ఉందా అని గ్రామస్తులను అడుగగా ఈ దరిదాపుల్లో ప్రభుత్వ స్థలం లేదని వారు పేర్కొన్నారు. దీంతో స్పష్టమైన హామీ లభించకపోవడంతో గ్రామస్తులు నిరాశ చెందారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రమేష్,



తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్, ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, ఏపీఓ కల్పన, ఏఈలు రాజ్‌కుమార్, ఆత్మారాం, జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, జెడ్పీటీసీ శ్రీరామారావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, స్థానిక సర్పంచ్ నక్క పద్మ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అడ్డుకున్న పంచాయతీ కార్మికులు

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ హనుమంత్‌రావును కొన్ని రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. పెసరుకుంట గ్రామానికి కలెక్టర్ హేమంత్ బోర్కడెతో పాటు వస్తున్నట్టు సమాచారం అందడంతో ప్రధాన రోడ్డుపై అడ్డంగా నిలబడి నినాదాలు చేస్తూ అడ్డుకున్నారు. దీంతో ఎస్ఐ సనత్‌కుమార్ వారిని సముదాయించి పక్కకు పంపించారు. దీంతో తమ బాధలు చెప్పుకుందామని వినతిపత్రం అందజేద్దామని ఎంతో ఆశతో వచ్చిన తమ గోడును ఆలకించకుండానే అధికారులు వెళ్లిపోవడంతో పంచాయతీ కార్మికులు నిరాశ చెందారు.

బీజేపీ, కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీజేపీ, కాంగ్రెస్ మాటలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని లోకారి గ్రామంలో రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన సవారి బంగ్లా షెడ్‌ను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తోందని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ రైతులపై, మహిళలపై వ్యవహరిస్తున్న విధానాలపై ఎమ్మెల్యే మండిపడ్డారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో మహిళలపై అత్యాచారాలు ఆదివాసీలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మాటలను నమ్మి మోసపోవద్దని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గతంలో రూ. కోటి 96 లక్షలు ఉన్న సవారీ బంగ్లాల నిర్మాణాలు చేపట్టుకోగా ప్రస్తుతం రూ.10 కోట్లతో సవారి బంగ్లా షెడ్లను నిర్మాణాలు పూర్తి చేసుకోవడం జరిగిందని అన్నారు, రైతులకు 24 గంటల ఉచిత కరెంటును కేసీఆర్ అందిస్తూ, రైతులను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా పాటు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతులకు మూడు గంటల కరెంటు సరిపోతుందని మాట్లాడటం రైతుల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు అందించి రైతుబంధు కూడా అందించడం జరిగిందన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ, బీ ఆర్ఎస్ పార్టీ ఆదరణ పొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజరెడ్డి, ఎంపీపీ గంద్రత్ రమేష్, డీసీసీబీ డైరెక్టర్ మెస్రం పరమేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, కిషన్, మాజీ ఎంపీపీ నైతం లక్ష్మి శుక్లాల్, ఎంపీటీసీ మాడ సూరక్క, సర్పంచ్‌లు పెందుర్ కల్పనా లక్ష్మణ్. బీఆర్ఎస్ నాయకులు బుచ్చన్న పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-దస్తురాబాద్

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని జెడ్పీ సీఈఓ సుధీర్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మున్యాల, గోడిసిర్యాల గ్రామాలలో ఆయన పర్యటించారు. గోదావరి నది పరివాహక ప్రాంతాలైన గ్రామాలలో వరద ప్రవాహం తీరును, నీట మునిగిన పంటలను, నెలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. సంబంధిత అధికారులకు ఎంత నష్టం వాటిల్లిందో అంచనా వేయాలని తెలిపారు. మున్యాల్ గ్రామపంచాయతీ సందర్శించి అక్కడే డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గోడిసిర్యాల గ్రామపంచాయతీలో హెల్త్ క్యాంప్ నిర్వహించగా రోగులకు మందులను అందించారు. ఆయన వెంట జడ్పీటీసీ శారద శ్రీనివాస్, ఎంపీపీ సింగరి కిషన్, ఎంపీడీఓ భాస్కర్ రెడ్డి, ఎంపీఓ అనిల్ కుమార్, సర్పంచులు దుర్గం శంకర్, ఒరిసే పోసవ్వ, మాణిక్ రావు, శివయ్య, పంచాయతీ కార్యదర్శులు రాజేశ్వరి, సౌమ్య, మల్లేష్, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్, ఐకేపీ వీఓ కిషన్ ఉన్నారు.

దస్తురాబాద్ : వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ ధన్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దేవునిగూడెం, భూత్కూర్, మున్యాల్, గోడిసిర్యాల గ్రామాలలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పర్వత ప్రాంతాల నుంచి గోదావరిలోకి వరద నీరు రావడంతో జ్వరాలు ప్రబలకుండా ఉండటానికి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని అన్నారు. తమకు సంబంధించిన గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ప్రజలకు అనారోగ్యం రీత్యా ఏమైనా జ్వరాలు, అతిసారవ్యాధి, డయేరియా లాంటి వ్యాధులు ప్రబలినచో తెలియజేయాలని అన్నారు. ముందస్తుగా సమస్యాత్మక గ్రామాలలో క్యాంపులు నిర్వహించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి వెంట



డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజేందర్, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ కామేశ్వర్, డాక్టర్ నాగరాజు, హెచ్ఈఓ వేణుగోపాల్, వైద్య సిబ్బంది ఉన్నారు.

బజార్‌హత్నూర్ : గర్భిణీ స్త్రీలు మంచి పోషకాహారం ఉన్న ఆహారం తీసుకోవాలని డాక్టర్ శిల్పా అన్నారు. శుక్రవారం మండలంలోని భూతాయి(కె) సబ్ సెంటర్ పరిధిలోని దాదాపు 30 మంది గర్భిణీ స్త్రీలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేకించి గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సంద్భంగా డాక్టర్ శిల్పా, అలేఖ్యలు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారమైన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉల్దారాణి, ఏఎన్ఎంలు అన్నపూర్ణ, శ్రీలత, ఆశ కార్యకర్తలు అనిత, పద్మ పారుబాయి, రేణుక పాల్గొన్నారు.

అంకోలి బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

భారీ వర్షాల కారణంగా కోతకు గురైన అంకోలి బ్రిడ్జ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే జోగు రామన్న పరిశీలించారు. వరద నీటి ప్రవాహంతో వంతెన కోతకు గురికాగా అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు. రాకపోకలకు ఇబ్బంది తలెత్తకుండా చేపట్టాల్సిన తక్షణ చర్యలపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ ఎత్తున కురిసిన వర్షాలకు పలు చోట్ల రహదారులు, వంతెనలు ధ్వంసమయ్యాయని అన్నారు. వాటి పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కుంభవృష్టి వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అధికారులు, ప్రజా ప్రతినిధులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజా రెడ్డి, ఎంపీపీ గంద్రత్ రమేష్, గొర్ల కాపర్ల సంఘం అధ్యక్షులు గంగయ్య యాదవ్, సర్పంచ్ భూమన్న, బీఆర్ఎస్ నాయకులు రమణ, కుమ్ర రాజు ఉన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లగా, పలు ఇండ్లలోకి వరద నీరు చేరింది. పట్టణంలోని సుభాష్‌నగర్ వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాగు సమీప ఇండ్లలోకి నీరు చేరి నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. ఈ సందర్భంగా పలువురు వారికి అండగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా సోషల్ వెల్ఫేర్ రిటైర్డ్ ఆఫీసర్ సుశీల్ ఆధ్వర్యంలో టీచర్స్ కాలనీకి చెందిన రిటైర్డ్ టీచర్ ప్రభాకర్ రూ.5వేలతో నిత్యావసర సరుకులను కొని శుక్రవారం వారికి పంపిణీ చేశారు. ఆయన వెంట గొంటిముక్కుల దామోదర్ ఉన్నారు.

కులవృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం చేయూత



నవతెలంగాణ-ఖానాపూర్

బీసీ కులవృత్తుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ కులవృత్తి 50మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ బీసీ కులవృత్తుల ఆర్థిక చేయూత మంజూరు అవుతుందని అన్నారు. మంజూరైన ప్రతి ఒక్కరికి ప్రతి నెల 15న చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతిఒక్క కుల సంఘాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లోకేష్ కుమార్, ఎంపీడీఓ బాల మల్లేశం, వైస్ ఎంపీపీ వాల్ సింగ్, పుప్పాల శంకర్, పుప్పాల గజేందర్, గొర్రె గంగాధర్, శోభన్‌బాబు, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షులు సాజీద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి తీసుకువచ్చేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని అన్నారు. స్థానిక రాంనగర్ కాలనీకి చెందిన జుబేర్ హుస్సేన్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పలు వార్డులను సందర్శించిన మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటువంటి సమస్య ఉన్నా మున్సిపల్ అధికారులను సంప్రదిస్తే, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కసాబ్‌గల్లి, వెంకట్‌రావు కాలనీ, గందేవార్ తోట తదితర కాలనీల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను పర్యవేక్షించి, సమస్యలపై ఆరా తీశారు. ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న వేళ ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉన్నారని తెలిపారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు ఆందోళన చేందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు.

కొండాపూర్ బ్రిడ్జిని పరిశీలించిన మాజీ ఎంపీ

నవతెలంగాణ-సిరికొండ

భారీ వర్షాల కొట్టుకుపోయిన కొండాపూర్ బ్రిడ్జిని మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు రాథోడ్ రమేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ప్రతి సంవత్సరం వర్షాకాలంలో బ్రిడ్జి కొట్టుకుపోవడం అధికారంలో ఉన్న పాలకులదే నిర్లక్ష్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కొత్తగా బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడుతున్న, ఏండ్లు గడుస్తున్న ఇంత వరకు పూర్తి చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమేనని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. తన సొంత నిధులతో తాత్కాలికంగా మరమ్మత్తులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్ రావు, జెడ్పీటీసీ చంద్రకళ రఘురాం, బీజేపీ మండల అధ్యక్షుడు అమూల్, కోఆప్షన్ సభ్యులు మాణిక్ రావ్, రిమ్మా సార్మెడి అమృత్ రావ్ పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టుపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు

నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని జెడ్పీటీసీ జానుబాయి ఆరోపించారు. శుక్రవారం కడెం ప్రాజెక్టును సందర్శించారు. మరమ్మతుల పనులను పరిశీలించారు గత సంవత్సరంలో లోతట్టు ప్రాంతమైన కడెం, కన్నాపూర్, పాండ్వాపూర్, కొండుకూర్, అంబారిపేట్ , బెల్లాల్ తదితర శివారులో పంట పొలాలు కొట్టుకు పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వలేదని అన్నారు. సంవత్సరం గడిచిన గేట్లను మరమత్తులు చేయకపోవడం దారుణమని అన్నారు. అనంతరం సీఈని కలిసి కడెం ప్రాజెక్ట్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు అధ్యక్షులు రాజేంధర్ హపావత్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ముక్కెర గంగాధర్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రావణ్, బైరి శ్రీనివాస్, భాస్కర్, గిరి, సదాశివ్, రాజు, రామకృష్ణ, నవీన్, శేఖర్, మోహన్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలోని ఇండ్లలోకి వర్షపునీరు వస్తున్నట్లు ఇటీవల గ్రామస్తులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించిన సంగతి తెలిసిందే, భారీ వర్షాల వలన దెబ్బతిన్న రోడ్ల పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలోని ఇండ్లలోకి వర్షపునీరు రావడానికి కారణమైన లింక్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు పునరుద్ధరణ చేయాలని తహసీల్దార్ మోహన్‌సింగ్‌కు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ఫ్రైడే, డ్రైడే నిర్వహించాలి



నవతెలంగాణ-సారంగాపూర్

ప్రతి ఇంటా ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కౌట్ల(బి)గ్రామంలో ఎంపీపీ పర్యటించి, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండ్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. నీళ్ల కుండీలో నీటి నిల్వలను ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. వీరి వెంట పంచాయతీ కార్యదర్శి సుధాకర్, నాయకులు రాంరెడ్డి, నారాయణరెడ్డి, సిబ్బంది ఉన్నారు.